నమస్తే తెలంగాణ

భద్రాద్రి కొత్తగూడెం

5 | ఖమ్మం, ఆదివారం 6 అక్టోబర్ 2024 | BHADRADRI KOTHAGUDEM


'బతుకునిచ్చే బతుకమ్మ..' అంటూ నాటి కేసీఆర్ సర్కారులో ఎంతో గౌరవాన్ని పొందిన స్వరాష్ట్ర సాంస్కృతిక పండుగకు నేటి కాంగ్రెస్ సర్కారులో అడుగడుగునా అవమానం ఎదురవుతోంది. ప్రకృతి పూజిత పూల పండుగపై ప్రభుత్వ పట్టింపులేని తనం ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యంగా నిలుస్తోంది. అసలు ఉద్యమంలో రాష్ట్ర ప్రజల్లో ఉత్తేజాన్ని నింపిన బతుకమ్మ అంటే ప్రభుత్వానికి భారంగానే కన్పిస్తున్నట్లుగా ఉంది. నాడు అన్ని వీధుల్లోనూ అంగరంగవైభవంగా ఆటలాడిన ఆడబిడ్డలకు.. నేడు ఎక్కడ చూసినా ఆటంకాలే ఎదురవుతున్నాయి. ఇందులో అధికార పార్టీ నేతలు సృష్టించే ఇబ్బందులు కొన్నైతే.. అసలు ప్రభుత్వమే కల్పించే ఆటంకాలు మరికొన్నిగా ఉన్నాయి. అస్తిత్వ ప్రతీకగా ఉన్న మన పూల పండుగకు ఖండాంతరాల్లోనూ అద్వితీయ ఆదరణ లభిస్తున్న వేళ .. స్వరాష్ట్రంలోనే నేడు దానికి అలక్ష్యం ఎదురవుతుండడం సర్కారు కక్షపూరిత ధోరణికి అద్దం పడుతోంది. సింగిడిలోని పూలన్నింటినీ తెచ్చుకొని సాయంత్రాన సంబురంగా ఆడుకుందామన్న అక్కాచెల్లెళ్ల ఆశలపై రేవంత్ సర్కారు ఎంచక్కా నీళ్లు చల్లింది. అసలు పండుగనే పట్టించుకోకపోగా.. ఘాట్‌ల వద్ద కనీసం పరిశుభ్రమూ చేయలేదు. పండుగ నిర్వహణ కోసం పైసా విదిల్చిన పాపానపోలేదు. చివరికి పట్టించుకున్నదీ లేదు.



ఈ ఏడాది ఖమ్మం కలెక్టరేట్‌లో పేలవంగా జరుగుతున్న వేడుకలు, కొద్ది సంఖ్యలో ఉన్న ఆశాలు



నిరుడు భద్రాద్రి కలెక్టరేట్‌లో ఘనంగా జరుగుతున్న అధికారిక వేడుకలు, అధిక సంఖ్యలో ఉన్న ఉద్యోగినులు

# బతుకమ్మంటే భారమా?

## నాడు గౌరవం.. నేడు అవమానం

- ప్రకృతి పూజిత పూల పండుగపై ప్రభుత్వంలో పట్టింపులేని తనం
- బతుకమ్మ ఆడుకునేందుకు ఘాట్‌లనూ సిద్ధం చేయని సర్కారు
- నాటి కేసీఆర్ సర్కారులో ఆడంబరంగా ఆటలాడుకున్న ఆడబిడ్డలు
- నేటి కాంగ్రెస్ సర్కారులో అసౌకర్యాల మధ్య ఆడుతున్న అతివలు
- తూటికాడతో నిండిన చెరువులు.. కనీస వెలుగులూ లేని వాగులు..
- పైసా విదిల్చింది లేదు.. పరిశుభ్రం చేసింది లేదు.. అసలు పట్టింపేలేదు..
- 'అస్తిత్వం'పై అలక్ష్యం.. అక్కాచెల్లెళ్ల ఆశలపై నీళ్లు చల్లిన ప్రభుత్వం..

భద్రాద్రి కొత్తగూడెం, నమస్తే తెలంగాణ/ అశ్వారావుపేట టౌన్/ ఇల్లెందు రూరల్/ టేకులపల్లి/ సారపాక, అక్టోబర్ 5: తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీకగా ఉన్న బతుకమ్మ పండుగను ప్రస్తుత ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. కనీసం అధికారిక వేడుకలూ నిర్వహించడం లేదు. నాటి కేసీఆర్ సర్కారులో సాంస్కృతిక వైభవం వెలుగొందిన తీరును.. నేటి కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోని తీరును గమనించిన ఆడబిడ్డలందరూ ఆవేదన భరితమవుతున్నారు. ప్రస్తుత ప్రభుత్వం పట్టించుకోకున్నా, పరిశుభ్రమైన ఘాట్‌లు సమకూర్చకున్నా బతుకమ్మ మీద మమకారంతో సొంతంగానే సౌకర్యాలను సమకూర్చుకుంటున్నారు. కొన్నిచోట్ల అసౌకర్యాల మధ్యనే ఆడుకుంటున్నారు. ఆఖరికి బతుకమ్మను నిమజ్జనం చేసేందుకు వాగుల వద్దకు వెళ్లే మార్గాల్లో కూడా వెలుగులు ఏర్పాటుచేయలేదు. దీంతో చిమ్మ చీకట్లలోనే ఆడబిడ్డలందరూ బతుకమ్మలను ఎత్తుకొని వెళ్తున్నారు. అలాగే, చెరువుల్లో తూటికాడ పెరిగి ఉన్న చోట్ల కూడా వాటిని తొలగించలేదు. దీంతో బతుకమ్మలను అక్కడ నిమజ్జనం చేసేందుకు అక్కాచెల్లెళ్లు అష్టకష్టాలు పడుతున్నారు.



తిరుమలాయపాలెంలో ఘాట్ ఏర్పాటుచేయకపోవడంతో నడుము లోతు నీళ్లలో దిగిన వ్యక్తి సాయంతో బతుకమ్మలను నిమజ్జనం చేస్తున్న ఆడబిడ్డలు

### బతుకమ్మ ఊసు లేదు.. చీరల జాడ లేదు..

గత కేసీఆర్ ప్రభుత్వంలో బతుకమ్మ పండుగకు నెల రోజుల ముందుగానే బతుకమ్మ చీరల పంపిణీ జరిగేది. ఆడబిడ్డలందరూ వాటిని ఎంతో ఆప్యాయంగా అందుకునే వారు. వాటినే ధరించి పండుగ రోజుల్లో బతుకమ్మ ఆడేవారు. కానీ కాంగ్రెస్ పగ్గాలు చేపట్టిన ఈ సమయంలో బతుకమ్మ చీరల జాడ లేదు. చివరికి బతుకమ్మ పండుగ ఊసే లేదు. గతంలో ప్రభుత్వ శాఖలు కూడా రోజుకు ఒక్కోటి చొప్పున తొమ్మిది రోజులపాటూ అంగరంగ వైభవంగా పండుగలు జరిపేవి. మహిళా అధికారులు, ఉద్యోగినులకు అప్పటి ప్రభుత్వం మధ్యాహ్నం నుంచి సెలవు సౌకర్యాన్ని కల్పించేది. దీంతో వారంతా వెళ్లి సాయంత్రం సంబురంగా బతుకమ్మ వేడుకల్లో పాల్గొనే వారు. కానీ నేడు ఎక్కడా అలాంటి పరిస్థితి కన్పించడం లేదు.

### నాడు అధికారికంగా.. నేడు నిరాదరణగా..

తెలంగాణ వచ్చాక నాటి కేసీఆర్ ప్రభుత్వం అధికారికంగా బతుకమ్మ వేడుకలు నిర్వహించింది. జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు తమ పరిధిలో వేడుకలు నిర్వహించేవారు. కానీ ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో అలాంటి పరిస్థితి లేకుండాపోయింది. నిరుటి బతుకమ్మ వేడుకలు సాక్షాత్తూ భద్రాద్రి కలెక్టరేట్‌లో నిరుడు వైభవంగా జరుగగా.. నేడు ఆ ఉత్సవాల ఊసే లేకుండా పోవడం గమనార్హం.

### తూటికాడ తొలగించకుండా బతుకమ్మ నిమజ్జనమెలా?

అశ్వారావుపేట మండలంలో బతుకమ్మ వేడుకలకు ప్రభుత్వం నుంచి ఆదరణ కన్పించడం లేదు. మండలంలోని పలు చెరువుల్లో బతుకమ్మలను నిమజ్జనం చేసేందుకు ప్రభుత్వం కనీస సౌకర్యాలు కల్పించలేదు. కొన్ని చెరువుల్లో నీళ్లు లేవు. బతుకమ్మ ఘాట్ ఉన్న దొంతికుంట చెరువులో నీళ్లు ఉన్నప్పటికీ అక్కడ దుర్గంధం వెదజల్లుతోంది. చెరువంతా తూటికాడ, గుర్రపు డెక్క ఏపుగా పెరిగి ఉండడంతో అక్కడ బతుకమ్మ నిమజ్జనానికి ఆటంకం కలుగుతోంది. ఇక్కడి ఘాట్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం కనీస చర్యలు కూడా తీసుకోలేదు.



కోనేటి చెరువులో గుర్రపుడెక్కను తొలగిస్తున్న పంచాయతీ కార్మికులు

### 'ఘాట్' ప్రాంగణం అపరిశుభ్రం..

బూర్గంపహాడ్ మండలంలోనూ సరైన సౌకర్యాలు లేక ఆడబిడ్డలు ఇబ్బందులు పడుతూనే బతుకమ్మ ఆడుతున్నారు. బతుకమ్మ కోసం ఏటా విద్యుత్ దీపాలతో వెలుగులీనే ఘాట్‌లు ఈసారి చీకటిమయంగా కన్పిస్తున్నాయి. మండలంలో ముఖ్యమైన నాగినేనిప్రోలు రెడ్డిపాలెం పల్లెప్రకృతి, బతుకమ్మ ఘాట్‌లలో అపరిశుభ్రత తాండవించింది. ఆడబిడ్డలు వచ్చి అక్కడ బతుకమ్మను నిమజ్జనం చేయాల్సి ఉన్నా ప్రభుత్వం అక్కడ సరైన సౌకర్యాలు కల్పించలేదు.



నాగినేనిప్రోలు రెడ్డిపాలెం బతుకమ్మ ఘాట్‌లో ఎలాంటి ఏర్పాట్లూ లేని దృశ్యం

### బతుకమ్మ పండుగ వేళ గ్రామమంతా అంధకారం..

ఇల్లెందు మండలంలో ఇంకో ఆటంకాన్ని ప్రభుత్వం కల్పించినట్లుగా కన్పిస్తోంది. రాత్రి వేళ ఇక్కడి ఆడబిడ్డలు వీధుల్లోకి చేరుకొని వీధి లైట్ల బతుకమ్మ ఆడుకుంటుంటారు. కానీ మండలంలోని పోలారం గ్రామంలో ప్రభుత్వం వీధి లైట్లను ఏర్పాటు చేయలేదు. దీంతో ఇక్కడి మహిళలు చీకట్లోనే బతుకమ్మ ఆడుకోవాల్సి దుస్థితి నెలకొంది. కొన్ని నెలలుగా ఇక్కడ వీధి లైట్లు లేకున్నా ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదు. చివరికి బతుకమ్మ వేడుకల వేళ కూడా స్పందించలేదు. వీధి లైట్లు ఏర్పాటు చేయలేదు.



అంధకారంలో ఉన్న పోలారం గ్రామం

### ఆడబిడ్డలను అవమానించడమే కదా..



తెలంగాణలో సంస్కృతికి ప్రతీక.. బతుకమ్మ పండుగ. ఇంతటి ముఖ్యమైన పండుగను ప్రభుత్వం పట్టించుకోవడం లేదంటే తెలంగాణ ఆడబిడ్డలను అవమానించడమే. వాళ్లకు ఈసారి ఇంకా బతుకమ్మ చీరలు ఇవ్వలేదు. నిన్నటి వరకు చీరలు రానేలేదు. గత ప్రభుత్వంలో మిగిలిన చీరలను ఇప్పుడు ఇవ్వాలని చూస్తున్నారు. బతుకమ్మ అంటేనే ఆడబిడ్డల పండుగ. కానీ ఈ ప్రభుత్వంలో ఈ పండుగకు ఆదరణ లేకుండా పోతోంది. ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారికంగా వేడుకలు జరపడం లేదు.

**–కాపు సీతాలక్ష్మి, మున్సిపల్ చైర్‌పర్సన్, కొత్తగూడెం**

### నాడు సంబురం.. నేడు విచారం..



గత కేసీఆర్ ప్రభుత్వంలో బతుకమ్మ పండుగ వేళ ఆడబిడ్డలందరూ ఎంతో సంబురంగా ఉండేవాళ్లు. ఆనందంగా బతుకమ్మ ఆడేవారు. అప్పుడే వచ్చిన బతుకమ్మ చీరలను ధరించి మురిసిపోయేవాళ్లు. కానీ ఇప్పుడున్న ప్రభుత్వంలో ఆడబిడ్డలు అంత ఆనందంగా లేదు. ఈ సారి బతుకమ్మ చీరలు కూడా ఇంకా ఇవ్వలేదు. బతుకమ్మ ఆడేందుకు అక్కాచెల్లెళ్లు ఎంతో ఉత్సాహంగా ఉన్నారు. కానీ ఈ సర్కారు మాత్రం సరైన సౌకర్యాలు కల్పించడం లేదు.

**–ఆమెడ రేణుక, టేకులపల్లి**

# ఖమ్మంలో జీవీ మాల్ ప్రారంభం

## సందడి చేసిన సినీనటి కీర్తి సురేశ్

రఘునాథపాలెం, అక్టోబర్ 5: ప్రముఖ వస్త్ర వ్యాపార సంస్థ 'జీవీ మాల్' ఖమ్మంలోని వైరారోడ్డులో శనివారం నూతన షాపింగ్‌మాల్‌ను ప్రారంభించింది. దీనికి ముఖ్యఅతిథిగా సినీ నటి కీర్తి సురేశ్ హాజరై అభిమానులతో సందడి చేశారు. 'నేను.. మీ కీర్తి సురేశ్‌ని. బాగున్నారా..' అంటూ మొదట అభిమానులను పలకరించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేశారు. ముందుగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జీవీ మాల్ వస్త్ర సముదాయాన్ని ప్రారంభించారు. పెద్ద పెద్ద నగరాలకే పరిమితమైన షాపింగ్‌మాల్స్ ఇక్కడి ప్రజల జీవన శైలి, అభిరుచులకు అనుగుణంగా అంతర్జాతీయ ఫ్యాషన్ స్టైల్స్‌లో అందించాలనే ఉద్దేశంతో ఖమ్మంలోనూ ఏర్పాటు చేయడం సంతోషమని పేర్కొన్నారు. నగర ప్రజలు దసరా పర్వదినం సందర్భంగా చక్కటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సినీనటి కీర్తి సురేశ్ షాపింగ్‌మాల్ మొత్తం కలియతిరిగి వస్త్ర దుకాణంలో అందుబాటులో ఉంచిన సరికొత్త రకాలను పరిశీలించారు. జబర్దస్త్ టీం సభ్యులు ఆటో రాంప్రసాద్, హైపర్ ఆదీలు చేసిన స్కిట్స్ అలరించాయి. మేయర్ పునుకొల్లు నీరజ, షోరూం అధినేతలు గుర్రం ఉమామహేశ్వరరావు, గుర్రం వాసు, గుర్రం మురళి, భద్రాద్రి బ్యాంక్ చైర్మన్ చెరుకూరి కృష్ణమూర్తి పాల్గొన్నారు.



జీవీ మాల్‌లో వస్త్రాల మోడళ్లు ఆవిష్కరిస్తున్న సినీ నటి కీర్తి సురేశ్

# బీఆర్ఎస్ శ్రేణులపై అక్రమ కేసులు ఎత్తివేయాలి

## భద్రాద్రి ఎస్పీకి పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు ఫిర్యాదు

మణుగూరు టౌన్, అక్టోబర్ 5: పినపాక నియోజకవర్గంలో అన్ని మండలాల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై బలవంతంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేస్తూ వేధింపులకు గురిచేస్తున్నారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. తమ పార్టీ శ్రేణులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ మేరకు శనివారం జిల్లా ఎస్పీ రోహిత్‌రాజును ఆయన కార్యాలయంలో కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రేగా మాట్లాడుతూ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై అక్రమంగా కేసులు పెడితే భయపడే ప్రసక్తే లేదని, వారికి తనతో పాటు తమ పార్టీ అండగా ఉంటుందని అన్నారు. తమ ప్రభుత్వ హయాంలో ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలపై ఎలాంటి కేసులు పెట్టలేదని, వేధింపులకు గురిచేయలేదని అన్నారు. తప్పుడు కేసులు పెట్టిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు. బీఆర్ఎస్ నాయకులు పోశం నర్సింహారావు, ముత్యం బాబు, కుర్రి నాగేశ్వరరావు, భాస్కరరావు, వట్టం రాంబాబు, ముద్దంగుల కృష్ణ, కుంటా లక్ష్మణ్, ఆవుల నర్సింహారావు, ఎడ్ల శ్రీనివాస్, దర్శనాల శ్రీనివాస్, నూకారపు రమేష్ పాల్గొన్నారు.



ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు

# నగరం పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యంగా ఉంటాం

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం, అక్టోబర్ 5: ఖమ్మం నగరం పరిశుభ్రంగా ఉంటేనే మనమంతా ఆరోగ్యంగా ఉంటామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రాపర్తినగర్ 58వ డివిజన్‌లో టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.1.10 కోట్లతో చేపట్టిన స్టార్మ్ వాటర్ డ్రెయిన్, సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శనివారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. 58వ డివిజన్ పెద్ద డివిజన్ అని, కొత్త కాలనీలు, ఇంటి నిర్మాణాలు వస్తున్నందున అవసరమైన మౌలిక వసతులు కల్పించడానికి చర్యలు తీసుకుంటామని అన్నారు. ఖమ్మం నగర అభివృద్ధికి పకడ్బందీ చర్యలు తీసుకుంటామన్నారు. మేయర్ పునుకొల్లు నీరజ, నగరపాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య, కార్పొరేటర్ కమర్తపు మురళి, ఖమ్మం అర్బన్ మండల తహసీల్దార్ సీహెచ్ స్వామి, ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి

# ప్రభుత్వాసుపత్రుల్లో మెరుగైన వైద్యం

– రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ రవీంద్రనాయక్

భద్రాచలం/ సారపాక, అక్టోబర్ 5: ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ బి.రవీందర్‌నాయక్ తెలిపారు. శనివారం జిల్లాలోని పలు ఆసుపత్రులను తనిఖీ చేశారు. బూర్గంపాడు మండలం మోరంపల్లిబంజర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందుతున్న వైద్యసేవల గురించి డీఎంహెచ్‌వో భాస్కర్‌నాయక్, వైద్యులను అడిగి తెలుసుకున్నారు. తొలుత ఐపీ, ఓపీ వార్డులు, రక్తపరీక్షల గది, ఫార్మసి గదులను పరిశీలించారు. అత్యవసర మందుల నిల్వలను పరిశీలించి రోగులకు రక్తపరీక్షల వివరాలను అడిగి కాన్పు అయిన మహిళ, రోగులతో వైద్యసేవలు ఎలా ఉన్నాయంటూ ఆరాతీశారు. అలాగే, భద్రాచలం ఏరియా ఆసుపత్రిని కూడా పరిశీలించారు. వైద్యులు, సిబ్బంది పనితీరు, హాజరుశాతంపై పలు సూచనలు చేశారు. ఏజెన్సీ ప్రాంత ప్రజలకు అందుతున్న వైద్యంపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆసుపత్రిలో రోగులను పరామర్శించి వైద్యంపై ఆరాతీశారు. పూర్తిస్థాయి వైద్యం అందించేందుకు వైద్యుల కొరత ఉందని ఆసుపత్రి సూపరింటెండెంట్ రామకృష్ణ ఆయన దృష్టికి తీసుకువెళ్లగా త్వరలో పూర్తిస్థాయి నియామకాలు చేపట్టేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆసుపత్రిలో పూర్తిస్థాయిలో మందులు అందుబాటులో ఉంచాలన్నారు. అనంతరం భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. డీఎంహెచ్‌వో భాస్కర్‌నాయక్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి బి.బాలాజీ, జిల్లా టీబీ ఆఫీసర్ సాయికల్యాణ్, జిల్లా మాస్ మీడియా అధికారి ఫియాజ్, రామకృష్ణ, డిప్యూటీ డెమో ఫైజ్‌మోహిద్దీన్, వైద్యులు కల్యాణ్, లక్ష్మిసాహితీ, ఆర్ఎంవో పాల్గొన్నారు.



వైద్యం ఎలా ఉందంటూ రోగులను అడిగి తెలుసుకుంటున్న హెల్త్ డైరెక్టర్

# సంతానలక్ష్మి అవతారంలో అమ్మవారు

భద్రాచలం, అక్టోబర్ 5: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిప్రపత్తులతో కొనసాగుతున్నాయి. శనివారం శ్రీలక్ష్మీతాయారు అమ్మవారు శ్రీసంతానలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సంతానం లేనివారు ఈ రూపంలో ఉన్న అమ్మవారిని పూజిస్తే పండంటి పిల్లలు పుడతారని భక్తుల నమ్మకం. సంతానలక్ష్మి అమ్మవారిని సంతానంతోపాటు సుఖసంతోషాలు ప్రసాదించాలని వేడుకున్నారు. అమ్మవారికి ఉదయం ప్రత్యేక స్నపన తిరుమంజనం, పూజలు, మధ్యాహ్నం కుంకుమార్చన చేశారు. చిత్రకూట మండపంలో జరుగుతున్న శ్రీరామాయణ పారాయణోత్సవాల్లో భాగంగా వేదపండితులు, అర్చకులు అయోధ్య కాండపారాయణం చేశారు.



సంతానలక్ష్మిగా దర్శనమిస్తున్న అమ్మవారు

**నేడు గజలక్ష్మి అవతారం..**

శ్రీదేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం లక్ష్మీతాయారు అమ్మవారు మూడోరోజు శ్రీగజలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

**పర్ణశాలలో ప్రత్యేక పూజలు**

పర్ణశాల, సెప్టెంబర్ 5: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాలలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ మూలవిరాట్లకు నూతన వస్త్రాలు అలంకరించి పసుపు కుంకుమ పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. చిన్నబండ్రేవు గ్రామంలో దుర్గాదేవిని సంతానలక్ష్మి అవతారంలో అలంకరించి పూజలు చేశారు.

# దాదీ మా బతుకమ్మా.. దామెర మొగ్గల బతుకమ్మా..

**ఉమ్మడి జిల్లాలో నాలుగో రోజూ కొనసాగిన పూల పండుగ**

**'నానబియ్యం బతుకమ్మ'లను ఎత్తుకొని ఆడిపాడిన ఆడబిడ్డలు**

'చిన్నీ మా బతుకమ్మా.. చిన్నారక్కా బతుకమ్మా.. దాదీ మా బతుకమ్మా.. దామెర మొగ్గల బతుకమ్మా..' అంటూ ఉమ్మడి జిల్లా ఆడబిడ్డలందరూ ఆడిపాడారు. తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని చాటే బతుకమ్మ వేడుకలు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో నాలుగో రోజైన శనివారమూ ఘనంగా కొనసాగాయి. నాలుగో రోజు నానబియ్యం బతుకమ్మలను ఎత్తుకొని ఆడబ్డిడలందరూ సందడి చేశారు. రెండు జిల్లాల్లో అన్ని గ్రామాల్లోనూ బాలికల నుంచి బామ్మల దాకా, యువతుల నుంచి మహిళల దాకా వయోభేదం లేకుండా బతుకమ్మ ఉత్సవాల్లో పాల్గొన్నారు. చప్పట్లు, కోలాటాలు, నృత్యాలతో బతుకమ్మ వేడుకల్లో పాల్గొంటున్నారు. ఇటు పలు ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారిక వేడుకలు కూడా జరుగుతున్నాయి. శనివారం ఖమ్మంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలోనూ వేడుకలు జరిగాయి. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలు ఉట్టిపడేలా ఉద్యోగినులు, మహిళలు బతుకమ్మలను పేర్చుకొని తీసుకొచ్చారు. సాయంత్రం జడ్పీ ఆవరణలో జరిగిన పూల పండుగ వేడుకల్లో జడ్పీ సీఈవో దీక్షా రైనా, డిప్యూటీ సీఈవో నాగలక్ష్మి సహా మహిళా అధికారులు నెత్తిన బతుకమ్మలతో హాజరయ్యారు. ఉద్యోగినులు, స్థానిక మహిళలు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తొలుత గౌరమ్మతల్లికి ప్రత్యేక పూజలు చేశారు. - ఖమ్మం, అక్టోబర్ 5



ఖమ్మంలో..



చర్ల: ప్రభుత్వ జూనియర్ కాలేజీలో..



వైరా టౌన్: వాణి వివేకానంద విద్యాలయంలో..



చింతకాని: శ్రీ ఆదర్శ పాఠశాలలో బతుకమ్మలతో ఉపాధ్యాయులు, విద్యార్థినులు



కొత్తగూడెంలో బతుకమ్మ అడుతున్న మహిళలు



బతుకమ్మను ఎత్తుకొని జడ్పీ సీఈవో దీక్షా



నగరంలో భారీ బతుకమ్మతో మహిళలు



ఖమ్మం రూరల్: విద్యార్థినులతో కలిసి బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్న శ్రీచైతన్య అధ్యాపకులు



ఖమ్మం బీఆర్ఎస్ కార్యాలయంలో బతుకమ్మలతో నగర విద్యార్థినులు



ఖమ్మంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో బతుకమ్మ అడుతున్న మహిళలు